RNI NO: TELTEL/2023/88524


# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

16 నవంబరు 2025 | మెదక్ | పేజీలు :5 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 68

# కారు గ్యారేజీకేనా



కారును వదిలి ప్రజలు బుల్‌డోజర్ వైపు ఎందుకు మొగ్గారు?

సిట్టింగ్ సీటు కోల్పోవడంతో క్యాడర్‌లో దెబ్బతిన్న ఆత్మస్థైర్యం

అభ్యర్థులు కాదు.. నాయకత్వ వైఫల్యమే అసలు కారణం

ఫామ్‌హౌస్‌కే పరిమితమైన అధినేత.. కేటీఆర్‌పై అధిక భారం

పోల్ మేనేజ్‌మెంట్‌లో ఫెయిల్...'రౌడీషీటర్' ప్రచారం రివర్స్

> గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదితను పోటీకి దింపినా బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో కూడా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అన్ని పార్టీల కంటే ముందుగా అభ్యర్థిగా ప్రకటించినా విజయం దక్కలేదు. అంటే, ఇక్కడ ప్రజలు అభ్యర్థుల కన్నా పార్టీ నాయకత్వాన్ని, దాని పంథాను మాత్రమే చూశారని అర్థమవుతోంది. రెండు కీలకమైన సిట్టింగ్ స్థానాలు కోల్పోవడం బీఆర్ఎస్ పునరుత్తేజానికి పెద్ద అవరోధంగా మారింది.

హైదరాబాద్, నవంబర్ 15, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం, పార్టీ శ్రేణులను మరింతగా కుంగదీసింది. గత రెండేళ్లలో రెండు సిట్టింగ్ స్థానాలను కోల్పోవడం ఆ పార్టీ క్యాడర్ ఆత్మస్థైర్యాన్ని దారుణంగా దెబ్బతీసింది. ఈ పరాజయానికి ప్రధాన కారణం అభ్యర్థులు కాదని, కేవలం పార్టీ అగ్ర నాయకత్వ వైఖరేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.గత రెండేళ్లుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రజా సమస్యలపై పెద్దగా బయటకు రాకపోవడం, అప్పుడప్పుడు కనిపించి వెళ్లడం మినహా ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం పార్టీకి నష్టాన్ని చేకూర్చింది. అనారోగ్య పరిస్థితులు కూడా ఆయనను జనంలోకి రానివ్వలేదు. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన భుజాలపై వేసుకున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ముమ్మరంగా ప్రచారం చేసినా, అధినేత చురుకైన పాత్ర లేకపోవడం ఓటర్లను ప్రభావితం చేయలేకపోయింది.ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప, బలమైన, నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయ అంశాలు లేకపోవడం ఒక లోపం. అయితే, అన్నిటికన్నా ముఖ్యంగా బీఆర్ఎస్

మిగతా 2లో

# బిర్సా ముండా స్ఫూర్తి



గిరిజనుల సంక్షేమాన్ని పక్కనబెట్టిన కాంగ్రెస్

ఆదివాసీల చరిత్రను గౌరవిస్తున్న బీజేపీ

6 కోట్ల స్క్రీనింగ్‌లు, స్థానిక భాషా విద్యకు ప్రాధాన్యత

బుల్లెట్ నుండి రోడ్ల వరకు 9,700 కోట్లతో అభివృద్ధి పర్వం

రాహుల్‌కు 'కులతత్వ విషం', 'మావోయిస్టు భావజాలం' అంటగట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

2

# దిల్లీకి సీఎం రేవంత్ బృందం

రాహుల్ గాంధీ ఖర్గేతో కీలక భేటీ

జూబ్లీహిల్స్ ఫలితంపై అధిష్ఠానానికి వివరణ

నవీన్ యాదవ్‌ను అభినందించిన రాహుల్ గాంధీ

శ్రమించిన నేతల వివరాలను అందించిన సీఎం

రాష్ట్ర రాజకీయాలపై చర్చ



2

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కీలక నేతల బృందం దిల్లీ వెళ్లి పార్టీ అధిష్ఠానాన్ని కలిసింది. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

# హైకోర్టుపై సైబర్ దాడి



బెట్టింగ్ 'పాప్-అప్' కలకలం!

ఆర్డర్ కాపీలను చేంజ్ చేసిన హ్యాకర్లు

రిజిస్ట్రార్ ఫిర్యాదు.. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్

ప్రభుత్వ సున్నిత వెబ్‌సైట్లపై పెరుగుతున్న ప్రమాదం

2

# జీవకారుణ్యం

ఉష్ణోగ్రతల పతనంతో జంతువులకు అసౌకర్యం

జూపార్క్‌లో వన్యప్రాణులకు అధికారుల 'వెచ్చని' రక్షణ

పెద్దపులులకు ప్రత్యేక రూమ్ హీటర్ల ఏర్పాటు

ఆహారం, షెల్టర్లలో కీలక మార్పులు

2



# పైరసీ వెబ్‌సైట్‌కు షాక్

కింగ్ పిన్ ఇమ్మడి రవి అరెస్ట్

ఫ్రాన్స్ నుంచి రాగానే అదుపులోకి

సినీ పరిశ్రమకు 22 వేల కోట్ల నష్టం!

కరేబియన్ కేంద్రంగా దందా

విశాఖపట్నం నుంచి అక్రమ కార్యకలాపాలు

2

ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వహణలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అంతర్జాతీయంగా చలనచిత్ర పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగిస్తున్న ఈ పైరసీ నెట్‌వర్క్‌లో కీలక నిందితుడిని అరెస్ట్ చేయడం పెద్ద విజయంగా పరిగణిస్తున్నారు.



# 'కంచుకోట' పై కాంగ్రెస్ కన్ను

ఖైరతాబాద్‌పై కాంగ్రెస్ 'అనర్హత అస్త్రం'


దానం నాగేందర్ రాజీనామాతో ఉప ఎన్నికల సునామీకి రేవంత్ రెడ్డి స్కెచ్?

జూబ్లీహిల్స్ జోష్‌తో మరిన్ని ఉప ఎన్నికలకు పార్టీ సిద్ధం!

రాజీనామాలతో గత పాలనకు తేడా చూపే ప్రయత్నం

జీహెచ్ఎంసీ లక్ష్యంగా... ఖైరతాబాద్‌తో 'మెట్రో' యుద్ధం మొదలు

హైదరాబాద్, నవంబర్ 15, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నప్పటికీ, రాజధాని హైదరాబాద్ పరిధిలో తన పట్టును ఇంకా పూర్తిస్థాయిలో సాధించలేకపోయింది. గత సాధారణ ఎన్నికల్లో ఇక్కడ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్, ఉప ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాలను మాత్రం గట్టిగా



వాడుకుంటోంది. తాజాగా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ విజయాలతో హైదరాబాద్ కోటపై పట్టు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉప ఎన్నికల ద్వారానే హైదరాబాద్ పరిధిలో తమ బలాన్ని పెంచుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీని కోసం

మిగతా 2లో

జమ్మూకశ్మీర్‌లో 360 కిలోల పేలుడు పదార్థాలు పేలి విధ్వంసం!

భూమి కంపించినంత శబ్దం

9 మంది మృతి, 27 మందికి గాయాలు,

300 మీటర్ల వరకు శరీర భాగాలు

వరుస పేలుళ్లతో నిలిచిపోయిన సహాయక చర్యలు

# భయంకర విస్ఫోటం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్ శివారులోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 11.22 గంటల సమయంలో సంభవించిన భారీ పేలుడు యావత్ రాష్ట్రంలో భయాన్ని రేకెత్తించింది. ఒక్కసారిగా భూమి కంపించినంత స్థాయిలో భయంకరమైన శబ్దం వినిపించగా, స్టేషన్ ప్రాంగణం నుంచి మంటలు ఆకాశాన్నంటాయి. దట్టమైన నల్లటి పొగతో ఆ ప్రాంతం మొత్తం నిండిపోయింది. ఈ పేలుడు తీవ్రత ఎంతలా ఉందంటే, సుమారు 300 మీటర్ల దూరంలో కూడా మానవ శరీర భాగాలు కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుడు ధాటికి

మిగతా 2లో



# పేలుడు ప్రమాదవశాత్తు జరిగింది

దీనిపై ఊహాగానాలు వద్దు

కేంద్ర హోంశాఖ అధికారిక స్పష్టత

మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్‌నిపుణులు, సాధారణ పౌరులు



2

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
ఆదివారం 16-11-2025

## పేలుడు ప్రమాదవశాత్తు జరిగింది

జమ్ముకశ్మీర్: శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 11.20 గంటల సమయంలో జరిగిన ఘోర పేలుడుపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ ఘటన వెనుక ఉగ్రవాద కోణం ఉందంటూ వస్తున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, ఇది కేవలం ప్రమాదవశాత్తు జరిగిందని జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే అధికారికంగా ప్రకటించారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ఈ ఘటనపై ఊహాగానాలు అవసరం లేదని, ఇది ప్రమాదవశాత్తు జరిగిందేనని నొక్కి చెప్పారు. దీనికి ముందు, జమ్మూకశ్మీర్ పోలీస్ చీఫ్ నళిన్ ప్రభాత్ కూడా నౌగామ్ పేలుడు ఉగ్రదాడి కాదని తేల్చి చెప్పారు. ఉగ్రసంస్థ పీపుల్స్ యాంటీ ఫాసిస్టు ఫోర్స్ పేలుడు బాధ్యతను ప్రకటించినప్పటికీ, ఈ వాదనను డీజీపీ ప్రభాత్ పూర్తిగా ఖండించారు.ఈ దురదృష్టకర ఘటనలో మొత్తం 9 మంది ప్రాణాలు కోల్పోగా, 32 మంది గాయపడ్డారు. మృతుల్లో కీలకమైన దర్యాప్తు సంస్థల నిపుణులు ఉండటం విషాదం. ఒక ఎస్ఐఏ (రాష్ట్ర దర్యాప్తు సంస్థ) అధికారి, ముగ్గురు ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్) సిబ్బంది, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్‌లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు మరియు ఆ బృందంతో పనిచేసే ఒక టైలర్ ఉన్నారు. 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, పక్కనే ఉన్న ముగ్గురు పౌరులు గాయపడగా, వారికి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.హర్యానా టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తు సందర్భంగా స్వాధీనం చేసుకున్న భారీ పేలుడు పదార్థాలు (360 కిలోలకు పైగా), రసాయనాలను నౌగామ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో భద్రపరిచారు. ఈ పదార్థాలు చాలా సున్నితమైనవి కావడంతో, వాటిని ప్రామాణిక విధానంలో ఫోరెన్సిక్ పరీక్షలకు పంపే ప్రక్రియ గత రెండు రోజులుగా నిరంతరంగా కొనసాగుతోంది. నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నప్పటికీ, ఈ సున్నితత్వం కారణంగానే ప్రమాదవశాత్తు విస్ఫోటం సంభవించినట్లు ఎంహెచ్ఏ పేర్కొంది.

నష్టం మరియు సహాయక చర్యలు: దెబ్బతిన్న మౌలిక వసతులు

పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ భవనం తీవ్రంగా దెబ్బతింది. చుట్టుపక్కల భవనాలకు కూడా పగుళ్లు వచ్చాయి. అధికారులు పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలను పరిశీలిస్తున్నారు. నౌగామ్, శ్రీనగర్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## దిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి బృందం

దిల్లీ: సీఎం రేవంత్ రెడ్డి బృందం మొదట కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితం గురించి రాహుల్‌కు వివరించారు. ముఖ్యమంత్రి వెంట దిల్లీ వెళ్లిన నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. ఉప ఎన్నికలో పార్టీ సాధించిన విజయంపై రాహుల్ నేతలకు అభినందనలు తెలుపగా, నవీన్ యాదవ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పారు.ఇంతటి ఘనవిజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ రాహుల్ అభినందించారు. క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఎంత కష్టపడిన విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌కు వివరించినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో పార్టీ బలోపేతానికి ఈ ఉప ఎన్నికల గెలుపు ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తున్నారు. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం, ఈ బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసింది. ఈ భేటీలో ముఖ్యంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ విజయానికి కష్టపడిన నాయకులను ఖర్గే కూడా అభినందించారు. హైదరాబాద్ పరిధిలో పట్టు పెంచుకునేందుకు పార్టీ అనుసరించాల్సిన భవిష్యత్ వ్యూహాల గురించి కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## హైకోర్టుపై సైబర్ దాడి:

హైదరాబాద్: హైకోర్టు వెబ్‌సైట్‌లోకి చొరబడిన సైబర్ నేరగాళ్లు, కోర్టు ఆర్డర్ కాపీలను డౌన్‌లోడ్ చేసే లింకులను మార్చేశారు. ఈ లింకుల ద్వారా పీడీఎఫ్ ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు ప్రయత్నించిన వినియోగదారులకు, ఆశ్చర్యకరంగా ఒక్కసారిగా ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ తెరచుకుంది. ఇది సైబర్ నేరగాళ్లు ఉద్దేశపూర్వకంగా చేసిన రీడైరెక్షన్ దాడి అని తెలుస్తోంది.

ఈ హ్యాకింగ్‌పై హైకోర్టు రిజిస్ట్రార్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో, న్యాయ పత్రాలకు సంబంధించిన పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులుగా 'బీడీజీ స్లాట్' అనే అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్‌సైట్ వస్తోందని పేర్కొన్నారు. అత్యంత పటిష్టంగా ఉండాల్సిన ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఇలాంటి అక్రమ సైట్ లింకులు కనిపించడం వ్యవస్థాపరమైన లోపాలను ఎత్తి చూపుతోంది.

## పైరసీ వెబ్‌సైట్‌కు షాక్

హైదరాబాద్:విశాఖపట్నం స్వస్థలం అయిన ఇమ్మడి రవి... కరేబియన్ దీవులలో ఒంటరిగా నివసిస్తూ, అక్కడి నుంచే సినిమాల పైరసీ కార్యకలాపాలు నిర్వహించేవాడని పోలీసులు తెలిపారు. శుక్రవారం రవి ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చినట్టు పక్కా సమాచారం అందుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు, శనివారం ఉదయం కూకట్‌పల్లిలోని రెయిన్‌విస్టా ఫ్లాట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు.'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో కొత్త సినిమాలు, ఓటీటీ కంటెంట్ విడుదలైన గంటల వ్యవధిలోనే పైరసీ కాపీలు అప్‌లోడ్ అవుతుండటంతో సినీ పరిశ్రమ భారీ నష్టాన్ని చవిచూసింది. పోలీసు వర్గాల అంచనా ప్రకారంతెలుగు సినీ పరిశ్రమకు: సుమారు 3,000 కోట్లు నష్టం.అన్ని భాషల సినీ పరిశ్రమలకు (మొత్తం): సుమారు 22 వేల కోట్ల నష్టం.ఈ అరెస్ట్, పైరసీకి వ్యతిరేకంగా సినీ పరిశ్రమ చేస్తున్న పోరాటానికి తాత్కాలిక ఊరటనిచ్చింది.కూకట్‌పల్లిలోని రవి నివాసం నుంచి పోలీసులు హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు సహా కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. 'ఐబొమ్మ' వెబ్‌సైట్, సర్వర్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో సైబర్ క్రైమ్ పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ సమాచారం ద్వారా ఈ అంతర్జాతీయ పైరసీ దందాలో రవికి సహకరించిన ఇతర నెట్‌వర్క్ సభ్యులను కూడా గుర్తించే అవకాశం ఉంది.

## కారు గ్యారేజీకేనా...?

పార్టీ పోల్ మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలమైంది.

**ప్రజల తీర్పు:** 'కారుకు, బుల్‌డోజర్‌కు మధ్య పోటీ' అంటూ బీఆర్ఎస్ పదే పదే ప్రచారం చేసినా, ఆక్రమణల విషయంలో ప్రజలు బుల్‌డోజర్ (బీజేపీ) వైపు మొగ్గు చూపారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**తప్పుడు వ్యూహం:** ఒకవైపు కాంగ్రెస్ అభ్యర్థిని రౌడీ షీటర్ అని ప్రచారం చేస్తూ, అదే సమయంలో మరికొందరు 'రౌడీ షీటర్లకు' పార్టీ కండువాలు కప్పడం వంటి విరుద్ధ చర్యలు బీఆర్ఎస్ విశ్వసనీయతను దెబ్బతీశాయి.

ఓటర్ల లెక్కలు: సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకోవడంలో కేటీఆర్ విఫలమయ్యారు. అలాగే, టీడీపీ తటస్థంగా ఉండటం కూడా పరోక్షంగా కాంగ్రెస్‌కు లాభించి, బీఆర్ఎస్‌కు నష్టం చేకూర్చింది.

**కేసీఆర్ వర్సెస్ రేవంత్: జనాలకు దగ్గరైన ముఖ్యమంత్రికి జై**

గత పదేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ వ్యవహరించిన తీరును, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లుగా కనిపిస్తోంది. కేసీఆర్ జనాలకు దగ్గరగా ఉండేవారు కాదు, ఏ కార్యక్రమానికి హాజరయ్యే వారు కాదు. కానీ మొన్న తెలంగాణ కవి అందెశ్రీ మరణించినప్పుడు రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు ప్రజలను కట్టిపడేసింది. ప్రజలకు అందుబాటులో ఉండని నాయకత్వం పట్ల ఓటర్లు విముఖత చూపారని స్పష్టమవుతోంది.

ముగింపులో, కేటీఆర్ చెప్పినట్లుగా తమను ప్రత్యామ్నాయంగా ప్రజలు చూస్తున్నారని భావించడం కంటే, పార్టీ ఎలా బలోపేతం కావాలో అవసరమైన చర్యలతో జనం ముందుకు వెళ్లాలి. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలే తమను గెలిపిస్తాయని భావిస్తే, జరిగే ఏ ఎన్నికల్లోనైనా 'కారు' పార్టీకి భంగపాటు తప్పదు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకోకుండా వ్యవహరిస్తే మరోసారి ఓటమిని రుచిచూడక తప్పదని గుర్తుంచుకోవాలి.

## కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశాన్ని అనుకూలంగా మార్చుకోవాలని ప్లాన్ చేస్తోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యేల విషయంలో అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పోరాడుతోంది. అయితే, స్పీకర్ నిర్ణయం లేదా సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా, రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించి ఉప ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది.

**ఫిరాయింపుల చట్టం, సుప్రీంకోర్టు తీర్పులకంటే ముందు దానం 'బలిదానం'**

ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు టెక్నికల్‌గా పార్టీలో చేరనప్పటికీ, అధికార కార్యక్రమాల్లో కాంగ్రెస్ కండువా వేసుకుని తిరుగుతున్నారు. వీరిపై వేటు తప్పదని బీఆర్ఎస్ గట్టిగా చెబుతున్న నేపథ్యంలో, వేటు పడేలోపే రాజీనామా చేయించడం ద్వారా ఉప ఎన్నికలు తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో త్వరలోనే రాజీనామా చేయిస్తారనే ప్రచారం బలంగా వినిపిస్తోంది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న దానం నాగేందర్‌తో మొదలుపెట్టి, మరికొందరితోనూ అదే బాటలో నడిపించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడం కంటే, వారితో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరడం ద్వారా పార్టీకి 'నైతికత' విషయంలో క్రెడిట్ వస్తుందని కాంగ్రెస్ నాయకత్వం ఆలోచిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల రాజీనామా చేయించకుండానే ఎల్పీలను విలీనం చేసుకుంది. తాము మాత్రం రాజీనామా చేయించామని, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్నామని చెప్పుకునే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ 'గతానికి-ఇప్పటికి' తేడాను నియోజకవర్గ ప్రజల ముందు ఉంచడం ద్వారా ఉప ఎన్నికల్లో సులువుగా గెలవవచ్చని ప్లాన్ చేస్తున్నారు.తొలుత జీహెచ్ఎంసీ పరిధిలో తమ బలాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టినందున, ఖైరతాబాద్‌ను లిస్ట్‌లో మొదట ఎంచుకున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ రాజీనామాలు, తద్వారా వచ్చే ఉప ఎన్నికలు కాంగ్రెస్‌కు బలాన్ని పెంచడంతో పాటు, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఒక బలమైన పునాదిగా ఉపయోగపడతాయని నాయకత్వం ఆశిస్తోంది. హైదరాబాద్ నగరంలో పార్టీ బలోపేతం కోసం రేవంత్ రెడ్డి వేసిన ఈ తాజా వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

## భయంకర విస్ఫోటం

పోలీస్‌స్టేషన్ భవనం పెద్దఎత్తున ధ్వంసమైంది. స్టేషన్‌లో పార్కింగ్ చేసిన పలు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల భవనాలకు సైతం పగుళ్లు వచ్చాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లుగా స్థానికులు, రెస్క్యూ సిబ్బంది పేర్కొన్నారు.

**విషాదానికి కారణం:** స్వాధీనం చేసుకున్న 360 కిలోల పేలుడు పదార్థాలే ఈ విస్ఫోటానికి గల ప్రాథమిక కారణాలపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హర్యానా-జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఫరీదాబాద్‌లోని ఒక ఇంటిపై జరిపిన ఆపరేషన్‌లో దాదాపు 360 కిలోల భారీ పేలుడు పదార్థాలు, అసాల్ట్ ఆయుధాలు, శత్రుదేశ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వీటిని నౌగామ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పదార్థాల నుంచే ఫోరెన్సిక్ టీమ్ నమూనాలను సేకరిస్తున్న ప్రక్రియలోనే పేలుడు సంభవించినట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు.

**రెస్క్యూకు ఆటంకం:**

ప్రధాన పేలుడు తర్వాత కూడా వరుసగా చిన్న చిన్న పేలుళ్లు కొనసాగడంతో రెస్క్యూ ఆపరేషన్‌లు మొదట్లో ఆపాల్సి వచ్చింది. చుట్టుపక్కల మరింత పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనన్న అనుమానంతో బాంబ్ డిస్పోజల్ టీమ్‌లను అప్రమత్తం చేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ఎన్డీఆర్ఎఫ్, ఫైరు సిబ్బంది, ప్రత్యేక దళాలు సమన్వయంతో శిథిలాలను తొలగిస్తూ చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు.

నష్టం తీవ్రత: ఈ ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ, తీవ్రంగా కాలిపోవడం వల్ల వాటిని గుర్తించడం కష్టతరంగా మారింది. వాటిని పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ పరీక్షల కోసం శ్రీనగర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. ఈ ఘటనలో 24 మంది పోలీసులు మరియు ముగ్గురు పౌరులు గాయపడ్డారు. వీరిని శ్రీనగర్‌లోని పలు ఆసుపత్రులకు తరలించారు. కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

**సమగ్ర విచారణ:** పేలుడు కారణాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల్లో రసాయనిక అస్థిరత ఏర్పడి పేలుడు జరిగిందా? లేక హ్యాండ్లింగ్‌లో పొరపాటు జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు జరుగుతోంది. అదే సమయంలో, పేలుడు సమయంలో ఏదైనా ట్రిగర్ మెకానిజం పనిచేసిందా అనే ఉగ్రవాద కోణాన్ని కూడా అధికారులు విస్మరించడం లేదు. జమ్మూకశ్మీర్ పోలీసులు ఈ ఘటనపై అధికారిక ప్రకటన ఇవ్వాల్సి ఉంది. ఈ పేలుడు ఘటనతో నౌగామ్, శ్రీనగర్ పరిసరాల్లో అదనపు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## బిర్సా ముండా స్ఫూర్తి

నర్మద (గుజరాత్): గిరిజనుల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా గుజరాత్‌లోని నర్మదాలో జరిగిన జన్‌జాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం ఆద్యంతం గిరిజన సంక్షేమం, దానిపై గత ప్రభుత్వాల వైఖరి చుట్టూ కేంద్రీకృతమైంది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆరు దశాబ్దాలుగా ఆదివాసీలను ఎలా విస్మరించాయో వివరించారు."గతంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజన వర్గాల్ని గాలికి వదిలేశాయి. ఈ కారణంగానే విద్య, పోషకాహార లోపం తీవ్రమైంది. ఆదివాసీ ప్రాంతంలో సికిల్‌సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారింది. గిరిజన సమాజం స్వాతంత్ర్యం కోసం రక్తాన్ని చిందించినా, వారి సహకారాన్ని విస్మరించిన ఘనత కొన్ని కుటుంబాలకే దక్కుతుంది" అని ప్రధాని మోదీ పదునైన విమర్శలు చేశారు. 2014కు ముందు బిర్సా ముండాను ఎవరూ గుర్తుంచుకోలేదని ఆయన ఆరోపించారు.గిరిజనుల అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధాని వివరించారు.ఆరోగ్యం: సికిల్‌సెల్ వ్యాధిని ఎదుర్కొనేందుకు ఆ ప్రాంతాల్లో డిస్పెన్సరీలు, ఆస్పత్రుల సంఖ్యను పెంచామని తెలిపారు. దేశవ్యాప్తంగా 6 కోట్ల మంది ఆదివాసీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. విద్య: కొత్త జాతీయ విద్యా విధానం కింద గిరిజన పిల్లలకు స్థానిక భాషల్లో చదువుకునే సౌకర్యం కల్పించడం వల్ల, భాషాపరమైన అడ్డంకులు తొలగి, వారు దేశాభివృద్ధిలో పాల్గొంటున్నారని ప్రధాని తెలిపారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సహా అనేక కీలక పదవుల్లో గిరిజనులు ఉండటం తమ ప్రభుత్వ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నిదర్శనమని అన్నారు.సందర్భంగా, ప్రధాని మోదీ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ముంబయి-అహ్మదాబాద్ మధ్య నిర్మితమవుతున్న తొలి బుల్లెట్ రైల్వే కారిడార్ పనుల పురోగతిని ఆయన సూరత్‌లో పరిశీలించారు. ఈ కారిడార్ ప్రయాణ సమయాన్ని రెండు గంటలు తగ్గించనుందని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నర్మదా జిల్లాలో రూ.9,700 కోట్ల వ్యయంతో కూడిన పలు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. సూరత్‌లో స్థిరపడిన బిహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్‌ను పరోక్షంగా ఉద్దేశిస్తూ, "కులతత్వ విషాన్ని చిమ్మే వారిని, ముస్లిం లీగ్-మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బిహార్ ప్రజలు తిరస్కరించారని" అన్నారు. దశాబ్దికాలంగా వరుస ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈవీఎంలు, ఎన్నికల వ్యవస్థను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ కనుగొందని ఆయన ఎద్దేవా చేశారు.

## జీవకారుణ్యం

హైదరాబాద్: నగరంలో ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో, హైదరాబాద్ జూపార్క్‌లోని వన్యప్రాణులు అసాధారణ వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. జంతువులు చలిని తట్టుకోలేక ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిన జూ అధికారులు, వాటికి రక్షణ కల్పించేందుకు 'వెచ్చని' చర్యలను అత్యవసరంగా చేపట్టారు.



**రాజా తీవి మాయం: చలికి గది మూలకు చేరిన వన్యరాజు**

సాధారణంగా దేనికీ భయపడని వన్యరాజు, పెద్దపులి సైతం పెరిగిన చలి కారణంగా తన రాజసపు ఠీవిని వదిలిపెట్టి, ఎన్‌క్లోజర్‌లోని ఒక మూలకు చేరి నక్కిపోవడం అధికారుల దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితిని గమనించిన జూ అధికారులు, వన్యప్రాణుల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**వార్మింగ్ టెక్నిక్స్: పెద్దపులులకు ప్రత్యేక రూమ్ హీటర్ల ఏర్పాటు**

పెద్దపులి గదిలోకి వెచ్చని గాలులు ప్రసరించే విధంగా అధికారులు తక్షణమే రూమ్ హీటర్లను అమర్చారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జంతువుల సహజ నివాసాలలో కృత్రిమంగా ఉష్ణోగ్రతను పెంచే ఈ చర్యలు, ముఖ్యంగా పెద్ద జంతువులకు ఊరటనిస్తున్నాయి.

**నిపుణుల సంరక్షణ:** పులులు, సింహాలు వంటి వాటితో పాటు ఇతర జంతువుల సంరక్షణ కోసం పలు మార్పులు చేశారు:

**శీతల గాలుల నివారణ:** చలి గాలులు ఎన్‌క్లోజర్‌లలోకి చొరబడకుండా వాటి చుట్టూ గన్నీ బ్యాగులు (గోనె సంచులు) అడ్డుగా అమరుస్తూ తాత్కాలిక షెల్టర్లను పటిష్టం చేశారు.

**ఆహారంలో మార్పులు:** జంతువుల శరీర ఉష్ణోగ్రతను నిలపడానికి వీలుగా వాటి రోజువారీ ఆహారంలోనూ మార్పులు చేశారు. చలికాలంలో సులువుగా జీర్ణమయ్యే మరియు ఎక్కువ శక్తిని ఇచ్చే ఆహార పదార్థాలను అందిస్తున్నామని జూ అధికారులు తెలిపారు.ఈ చర్యల ద్వారా జూలోని వన్యప్రాణులు ఆరోగ్యంగా, సురక్షితంగా చలికాలం గడిపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

# ధాన్యం డబ్బులు చెల్లింపులో మరింత వేగం పెంచాలి

**జిల్లాలో ఇప్పటివరకు 1,14,077.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 102.84 కోట్ల చెల్లింపులు..**

**కొనుగోళ్లల్లో ఇంకా వేగం పెరగాలి.**

**ట్యాగ్ చేసిన మిల్లులకే ధాన్యం తరలించాలి.**

**కొనుగోళ్ల పర్యవేక్షణ కై పటిష్ట చర్యలు.**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**



పాపన్నపేట,నవంబర్,15,మెదక్ టుడే న్యూస్: ధాన్యం డబ్బులు చెల్లింపులలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.పాపన్నపేట మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసిల్దార్ తో కలిసి పరిశీలించారు.ముందుగా కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం ఎంత, అందులో ఎంత మేరకు కొనుగోలు చేసారు.ఇంకా తేమ శాతం రావాల్సిన ధాన్యం ఎంత ఉంది, కొనుగోలు పూర్తి అయిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసారా లేదా, అలాగే కొనుగోలు అయిన ధాన్యంట్యాగ్ చేసిన మిల్లులకి తరలిస్తున్నారా లేదా అనిఅధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్, మాట్లాడుతూ,ఈ ఖరీఫ్ సీజన్ కి సంబందించి.ధాన్యం డబ్బుల చెల్లింపులలో మరింత వేగం పెంచి ముందుకు పోవాలని తెలిపారు.గత సంవత్సరం ఇదే నెలలో 10,185 మంది రైతుల నుంచి 61,231.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 4.71 కోట్ల రూపాయలను చెల్లించగా.ప్రస్తుత సీజన్ కి.ఇప్పటివరకు 27,252 మంది రైతుల నుండి 1,14,077.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 102.84 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు.తేమశాతం వచ్చి కొనుగోలు కి సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు వేగవంతం గా జరగాలన్నారు.అదే విధంగా కొనుగోలు కి సంబందించినరిజిస్టర్ లన్ని పక్కాగా నిర్వహించాలన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా.స్పెషల్ ఇన్స్పెక్షన్ టీం ను నియమించి పర్యవేక్షణ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# టిఆర్ టిఎఫ్ అధ్యక్షులుగా,జగన్ లాల్ ఏకగ్రీవం

## టిఆర్ టిఎఫ్ చేగుంట మండల కమిటీ ఏకగ్రీవం



చేగుంట నవంబర్ 15 మెదక్ టుడే న్యూస్
టిఆర్ టిఎఫ్ చేగుంట మండల అధ్యక్షులుగా కే జగన్ లాల్, ఎస్ఏ(హిందీ) జెడ్పిహెచ్ఎస్ కరీంనగర్ మండల ప్రధాన కార్యదర్శిగా దేవరాజ్, ఎస్ జి టి యుపిఎస్ పులిమామిడి, ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల టిఆర్ టిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు మెంగర్తి ప్రణీద్ కుమార్ అభినందనలు తెలియజేశారు. ప్రణీద్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడుస్తుంది. ఉపాధ్యాయ మిత్రులంతా, టిఆర్ టిఎఫ్ ను అందరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నూతన మండల కమిటీ సంఘ్ కార్యక్రమాలను ఉపాధ్యాయులకు చేరవేస్తూ, వారికి చేరువ కావాలని సూచించారు.నూతన కమిటీ మాట్లాడుతూ మాపై నమ్మకముంచి భాద్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,ఉపాధ్యాయుల శ్రేయస్సుకై తమ వంతు భాద్యత నెరవేరుస్తామని హామీ ఇచ్చారుజిల్లా కౌన్సిలర్ లుగా వి వెంకన్న, పిఎస్ హెచ్ఎం బోనాల అబ్దుల్ రషీద్, ఎస్ఏ(బయో), శ్రీనివాస్, ఎస్జిటి లు ఎన్నికయ్యారు.

## బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో

# ఘనంగా లక్ష బిల్వర్చన

అమీన్పూర్ నవంబర్ 15 (మెదక్ టుడే)న్యూస్ ప్రతినిధి
సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా భక్తుల సందడి నడుమ లక్ష బిల్వర్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్ వేదమంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ప్రతి సంవత్సరం మోహన్‌రావు కుటుంబ సభ్యులు విశేష భక్తితో లక్ష బిల్వర్చన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఈవో శశిధర్ గుప్త, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, లక్ష్మీకాంతరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ఏర్పాటు చేసిన సేవలను పర్యవేక్షించారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పాల్గొని స్వామిఆశీర్వాదాలు పొందారు.





# అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి.

అమీన్పూర్ నవంబర్ 15 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి
సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఓడిఎఫ్ కాలనీలో ప్రకాష్ రెడ్డి కన్నె స్వామి,విజయ రాఘవరెడ్డి కన్నె స్వామి, వి. రామ్ రెడ్డి గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి. మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి మాట్లాడుతూ ఆర్య పుత్రుడు అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి మీద ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం కార్తీక మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మాలవేసి ఆ శబరిమలకు వెళ్తున్న స్వాములందరికీ ధన్యవాదాలు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# పశు వైద్యశాల ద్వారా సమర్థవంతమైన సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..**



పాపన్నపేట,నవంబర్,15,మెదక్ టుడే న్యూస్: పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలోని పశువైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.. వైద్య సేవలు, మందుల రికార్డులను పరిశీలించారు. పశు వైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని ఆదేశించారు.హాస్పిటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,ఎప్పుడు పాడి రైతులకు అందుబాటులో ఉండి పాడి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించి వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పశు వైద్య అధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తపస్ కాంప్లెక్స్ కన్వీనర్ కో కన్వీనర్ల ఎన్నిక

చేగుంట నవంబర్ 15 మెదక్ టుడే న్యూస్చేగుంట మండలంలోని చేగుంట కాంప్లెక్స్ తపస్ కన్వీనర్ గా కొండ చరణ్ (ఎంపీపీఎస్ చేగుంట బాయ్స్ స్కూల్),కో కన్వీనర్ గా కే.విజయలత (ఎంపీపీఎస్ చేగుంట గర్ల్స్ స్కూల్) బోనాల కాంప్లెక్స్ కన్వీనర్ గా శ్రీనివాస్ (ఎంపీపీఎస్ రుక్మాపూర్),కో కన్వీనర్ గా స్వరూపరాణి, (ఎంపీపీ ఎస్ కిష్టాపూర్) మక్కరాజ్ పేట్ కాంప్లెక్స్ కన్వీనర్ గా సంగీత (ఎంపీపీఎస్ కసాన్ పల్లి),కో కన్వీనర్ గాఎం నరేష్ (ఎంపీపీఎస్ చందాయి పేట్), ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, జిల్లా బాధ్యులు మల్లారెడ్డి, బాలిశెట్టి రేఖ, దేశపతి కృష్ణమూర్తి, ప్రభాకర్, పట్లూరి యాదగిరి, తిరుపతి, సుమతి, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అమరేశ్వరి, మండల బాధ్యులు రాధా,సరస్వతి,ఎం శ్రీనివాస్,భూపాల్, నరసింహారెడ్డి, బంగారయ్య,వీణ, మంజులత,సంధ్యారాణి, ఉమాదేవి, వనిత, శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి 44 పైన రోడ్డు ప్రమాదం మహిళ మృతి



చేగుంట నవంబర్ 15 మెదక్ టుడే న్యూస్
జాతీయ రహదారి 44 హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన భార్య మృతిచెందగా, భర్త, కుమారుడు ఇద్దరికి గాయాలైన సంఘటన ఇస్లాంపూర్ గ్రామంలో విషాదాయ ఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.తన కుమారుని స్కూల్ ఫీజు కట్టి ఇంటికి వస్తుండగా దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందిన దుర్ఘటన శనివారం చోటుచేసుకుంది.తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పాటి చందూ, తన భార్య పాటి లక్ష్మీ, కుమారుడు తనయ్ (6) తో కలిసి మాసాయిపేట మండలం రామంతాపూర్ లోని జాన్సన్ అకాడమీ స్కూల్‌కు వెళ్లి ఫీజు కట్టి తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఇదే సమయంలో వెనుకనుంచి వచ్చిన కంటైనర్ లారీ బైక్‌ను ఢీకొనడంతో పాటి లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. పాటి చందూకు తలకు తీవ్రమైన గాయాలు, చిన్నారి తనయ్‌కు కూడా గాయాల య్యాయి వెంటనే 108 అంబులెన్స్ పైలెట్ భాను సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఇస్లాంపూర్ మాజీ సర్పంచ్ జంగం రమేష్ మాట్లాడుతూ ఈ ప్రమాదం గ్రామంలో తీవ్ర విషాదాన్ని కలిగించిందని, గాయపడిన వారి చికిత్స కోసం అవసరమైన సహాయం అందిస్తున్నామని తెలిపారు.

## కేవల్ కిషన్ విగ్రహం వద్ద నివాళులర్పించిన జన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవిత



**చేగుంట నవంబర్ 15 మెదక్ టుడే న్యూస్** మెదక్ జిల్లా చేగుంట మండలం, పొలంపల్లి గ్రామ శివారులోని గల ముదిరాజ్ ముద్దుబిడ్డ కామ్రేడ్ కేవల్ కిషన్ సమాధి వద్ద తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత కేవల్ కిషన్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం కవిత మాట్లాడుతూ. మెదక్ జిల్లాలో ప్రజా విప్లవానికి చేయూతనిచ్చి ప్రజలకు అనుకూలంగా, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసినవారు కేవల్ కిషన్. ముదిరాజు ముద్దుబిడ్డ కేవల్ కిషన్ అని అన్నారు. వారు బ్రతికి ఉన్నన్ని రోజులు నాకు ప్రజలే ముఖ్యమని అన్న కేవల్ కిషన్,వారి స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ బాటలు వేసేందుకు మేము కూడా సంతోషిస్తున్నాను అన్నారు. ముదిరాజుల్లో పుట్టడం ముదిరాజ్ బిడ్డలు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి అని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో జన జాగృతి నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు

**తిరుమల, నవంబర్ 15,** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తూండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు.

రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది. సతీష్ మొబైల్, వాహనం ఇతర విషయాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.సతీష్ కుమార్ ను ఎవరైనా హత్య చేశారా.. పరకామణి కేసులో ఆయన ఎవరి ఒత్తిడితో రాజీ చేసుకున్నారు.. రవికుమార్ ఆస్తులను ఎవరెవరు రాయించుకున్నారన్నది ఆయనకు తెలిసే అవకాశం ఉంది. ఒత్తిడి చేసిన పెద్దలే.. అసలు నిందితులు అవుతారు. ఆ విషయాలన్నీ? సతీష్ కుమార్ బయట పెడితే.. కేసు చిక్కుముడి వీడిపోతుంది. ఇలాంటి సమయంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది

## ఈనెల 19న పీఎం కిసాన్ నిధులు!

**న్యూఢిల్లీ,** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పీఎం కిసాన్, యోజన పథకం 21వ వాయిదా సొమ్ము ఈ నెల 19న రైతన్నల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. ఈ సొమ్మును ప్రధాని మోదీ విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.ఈ పథకం క్రింద అర్హులైన అన్నదాతలకు సంవత్సరానికి రూ.6,000 మూడు విడతల్లో అందజేస్తున్న సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్ ఖేల్...ఖతం... బైబై... టాటా... గుడ్ బై... గయా

### సంపాదకీయం



బిహార్ ఎన్నికల చిత్రం స్పష్టమైంది. 243 స్థానాల్లో 203 స్థానాలతో ఎన్డీఏ రికార్డు విజయం దిశగా దూసుకుపోయింది, మహాకూటమి ఖాతాలో 35 సీట్లు మాత్రమే వస్తున్నాయి. 2020తో పోలిస్తే ఎన్డీఏ 70కి పైగా సీట్లు సాధించగా, మహాకూటమికి అంతే నష్టం జరిగింది. కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది, కేవలం 4 సీట్లు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. అయితే ఇది కొత్తేమీ కాదు, 2014 నుంచి 2025 వరకు చూస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఓటమికి అలవాటు పడి ఉంటుంది.అయితే, గత 11 ఏళ్లలో కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో ఓడిపోయిందో, ఏయే రాష్ట్రాల్లో ఓడిపోయింది గత 11 ఏళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఇది 11 సంవత్సరాల వ్యవధిలో మూడు పూర్తి సైకిల్స్‌ను కవర్ చేస్తుంది.మొదటి ఎన్నిక- 2014లో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు 9 దశల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 543 స్థానాలకు 8,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 66.4 శాతం పోలింగ్ నమోదైంది, ఇది అప్పటి వరకు అత్యధికం. ఫలితాల్లో బీజేపీ 282 సీట్లు గెలుచుకుంది, ఇది 272 సీట్ల మెజారిటీ కంటే ఎక్కువ, అయితే కాంగ్రెస్ కేవలం 44 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికల నుంచే కాంగ్రెస్ కేంద్రంలో అధికారం కోల్పోయింది.రెండో ఎన్నిక- 2019లో 17వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు 7 దశల్లో పోలింగ్ జరిగింది. ఇక్కడ కూడా 543 సీట్లు ఉన్నాయి. 67.4 శాతం పోలింగ్ జరిగింది. బీజేపీ 303 సీట్లు సాధించగా, కాంగ్రెస్ కేవలం 52 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మూడో ఎన్నిక- 2024లో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 7 దశల్లో ఎన్నికలు జరిగాయి. 65.79% ఓటింగ్ జరిగింది. బీజేపీ 240 సీట్లు గెలుచుకోగా, ఎన్డీఏ మొత్తం 293 సీట్లు సాధించింది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది, ఇది 2014 తర్వాత అత్యుత్తమ ప్రదర్శన.ఈ ఎన్నికలు జాతీయ రాజకీయాలను బీజేపీ కేంద్రంగా మార్చాయి, ఇక్కడ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది, దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో హస్తం పార్టీకి ఈ దుస్థితి పట్టింది. అదే కర్ణాటక, తెలంగాణలో జాతీయ పార్టీగానే కాంగ్రెస్ పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. కానీ మిగిలిన చోట్ల ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్లపైనే ఆధారపడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004కు ముందు పరిస్థితులు ఏంటి? 2014 తర్వాత ఏంటి? అన్నది కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. పదేళ్లు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలాన్ని పెంచుకోలేకపోయింది.. నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ హయాంలోనూ ఉత్తర్ ప్రదేశ్ లో కాంగ్రెస్ కు మంచి పట్టు ఉండేది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉండేది. కానీ రాను రాను రాహుల్ గాంధీ జమానాకు వచ్చే సరికి ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో తమ పట్టును కోల్పోయింది. ఒకప్పుడు ఈ ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పిడికిలి బిగించి గెలిచేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీజేపీని తట్టుకోవాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి వెళ్లాలని అనుకోవడమే ఆ పార్టీ తనకు తానే ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చింది. కేవలం రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం అర్రులు చాస్తుంది. బీహార్ లోనూ కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ బలపడటానికి పరోక్షంగా కారణమయింది. బలమైన కాంగ్రెస్ నేతలు విడిపోయి ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్నారు. అది కూడా పార్టీకి ఇబ్బందిగా మారింది. మహారాష్ట్రలోనూ పొత్తులతోనే బరిలోకి దిగింది. ఒకప్పుడు బలమైన నాయకత్వం రాష్ట్రాల్లో ఉండేది. కానీ రానురాను రాష్ట్రాల్లో లీడర్ షిప్ బలహీనంగా మారింది. బీహార్ లోనూ అదే జరిగింది. మహా ఘట్ బంధన్ పేరుతో కూటమి ఏర్పాటు చేసుకున్నప్పటికీ, రాహుల్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టినప్పటికీ రాష్ట్రాల్లో బలహీనమవుతుంది. కాంగ్రెస్ బీహార్ లో సింగిల్ డిజిట్ కు పడిపోయినా ఆశ్చర్యం లేదు. ఎంఐఎం కంటే తక్కువ స్థానాల్లో లీడ్ లో ఉంది. అదీ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అది మెజారిటీలో కనిపిస్తుంది. నిజానికి బీహార్ లో మోదీ, నితీష్ కుమార్ అంటే నమో కాంబినేషన్ బాగా వర్క్ అవుట్ అయింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీష్ కుమార్ కు ముఖ్యంగా మహిళల ఓట్లు అనుకూలంగా ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీష్ కుమార్ పది వేల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూలు గెలవడమంటే ప్రజలు ఇక ఎన్డీఏ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించడానికి సిద్ధమయినట్లు కనిపించింది.ఇక ఎన్డీఏ కూటమి తొలి నుంచి ఒక పద్ధతి ప్రకారం వెళుతుంది. సీట్ల సర్దుబాటులోనూ ఎలాంటి అలకలు, ఇబ్బందులు లేకుండా చూసుకోగలిగింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ ను ప్రకటించింది. అదే సమయంలో అన్ని సామాజికవర్గాల నేతలను దగ్గరకు తీసుకుని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం ఎన్డీఏ కూటమి చేసింది. ఇక పోల్ మేనేజ్ మెంట్ విషయంలో కానీ, ప్రచారంలో కానీ బీజేపీ కూటమి మహా ఘట్ బంధన్ కంటే ముందంజలో ఉంది. ఆర్జేడీ వస్తే అవినీతి హెచ్చుమీరిపోతుందన్న బీజేపీ అందులోనూ మోదీ పదే పదే చేసిన ప్రచారం ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లింది. అన్నీ కలిసి బీజేపీ కూటమిని కలసి వచ్చినట్లే కనిపిస్తుంది. ఇక మోదీకి తిరుగులేదు. వరసగా ఒక్కొక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ను దానికి మద్దతిచ్చే పార్టీలను ఖతం చేస్తూ పోతుంది. దీన్ని బట్టి చూస్తే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. అందుకే రాహుల్ గాంధీ డైలాగ్ లాగానే కాంగ్రెస్ ఖేల్...ఖతం... బైబై... టాటా... గుడ్ బై... గయా అన్న డైలాగు గుర్తుకొస్తుంది

# పీకే ..పీకేందేమి లేదు

పాట్నా, నవంబర్ 15, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన సొంత జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలమయ్యారు. గతంలో అనేక పార్టీలకు విజయం అందించిన పీకే, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోగా, కనీసం ఆధిక్యం కూడా కనబరచలేకపోయారు. అనేక పార్టీలకు విజయం అందించిన ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయ ప్రస్థానం నిరాశపరిచింది. జన సూరజ్ పార్టీకి కనీసం ఒక్క ఆధిక్యం కూడా లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చింది అనే సామెత మాదిరి తయారైంది జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పరిస్థితి. గత రెండు దశాబ్దాలుగా అనేక పార్టీలకు ఎలక్షన్ స్ట్రాటజిస్టుగా పని చేసి, పార్టీల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు రచించారు ప్రశాంత్ కిషోర్. ఇక తాను స్వయంగా రాజకీయాల్లోకి దిగి జన సూరజ్ పార్టీ స్థాపించి, సొంత రాష్ట్రం బీహార్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి దిగారు. అయితే అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవకపోగా కనీసం ఆధిక్యాన్ని కూడా కనబరచలేకపోతోంది. మొత్తం 243 స్థానాల్లో ప్రశాంత్ కిషోర్ సహా.. ఏ ఒక్క చోట కూడా జన సూరజ్ పార్టీ ఓట్లు సాధించలేకపోయింది. అందరికీ స్ట్రాటజీలు ప్లే చేసే పీకే తన విషయం వచ్చేసరికి చతికిలా పడిపోయాడు పాపం అంటున్నారు రాజకీయ విమర్శకులు.బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ విపత్తుగా మారాయి. ఆయన పార్టీ జన్ సూరజ్ పార్టీ ఒకప్పుడు గేమ్-ఛేంజర్ గా, త్రిముఖ పోటీలో పోటీదారుగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. బీహార్ లోని 243 స్థానాల్లో పికె పార్టీ ఏ ఒక్కదానిలోనూ ఆధిక్యంలో లేదు. ఆయన అభ్యర్థులందరూ పేలవమైన స్థితిలో ఉన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని కుమ్రార్ నియోజకవర్గం విజయం కోసం అత్యంత గట్టిగా ఎదురుచూస్తున్న అభ్యర్థి, కానీ అక్కడ కూడా పీకే పార్టీ మూడవ స్థానంలో వెనుకబడి ఉంది.టీవీ ఛానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో, అనేక బహిరంగ సభలలో, ప్రశాంత్ కిషోర్.. “ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడదని రాతపూర్వకంగా రాసుకోండి. నవంబర్ తర్వాత నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదవి నుంచి తప్పుకుంటారు. కొత్త ముఖ్యమంత్రి నియమితులవుతారు” అని ఆయన అన్నారు. తన అంచనాలు విఫలమైతే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ఖఐ రెండుసార్లు అన్నారు. జన్ సూరజ్ గెలిచినా, జేడీయూ గురించి తన అంచనాలు నిజం కాకపోయినా, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, గతసారి కంటే మెరుగ్గా తీరు కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 200 సీట్ల మార్క్ దాటేసింది. ఒక్క జెడియు 80 సీట్లు గెలుచుకుంటుందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఖాతాను కూడా తెరవలేదు.జన్ సూరజ్ పార్టీ ఏర్పాటు చేయడానికి ముందు ప్రశాంత్ కిషోర్ మే 5, 2022 నుండి అక్టోబర్ 2, 2024 వరకు 6,000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన 5,000 గ్రామాలకు చేరుకుని 5,000 సమావేశాలు నిర్వహించారు. బీహార్ అంతటా తిరుగుతూ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మే 2022 నుండి 1,280 రోజుల పాటు బీహార్ మొత్తాన్ని గాలించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఎన్నికల ప్రచారాన్ని రోడ్డు మార్గంలోనే నిర్వహించారు. అక్టోబర్ 21 నుండి ప్రతిరోజూ సగటున 200 కి.మీ. ప్రయాణించానని పీకే చెప్పారు. ఆయన రోజూ 8 నుండి 10 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేశారు.ప్రశాంత్ కిషోర్ అక్టోబర్ 2022 నుండి క్రమం తప్పకుండా బీహార్‌లో పర్యటించారు. ఆయనతో పాటు తన బృందం క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించింది. వారు ప్రజలతో వారి సమస్యలు, ఆదాయం, ఉపాధి, విద్య గురించి చర్చించారు. ఈ బృందంలో ఐటీ నిపుణులు, మాజీ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఉన్నారు. కన్సల్టెన్సీ కంపెనీ ప్రొఫెషనల్ బృందాన్ని నిర్వహించింది. పాట్నా సహా మొత్తం 38 జిల్లాల్లో సుమారు 1,300 మంది నిపుణులతో కూడిన ఇరవై ఐదు ప్రత్యేక బృందాలు పనిచేశాయి. ప్రతి జిల్లాలో మూడు ప్రధాన బృందాలను ఏర్పాటు చేసుకున్నారు ప్రశాంత్ కిశోర్.ఆరు సంవత్సరాలలో ఆరుగురు ముఖ్యమంత్రులను నియమించిన ఈ వ్యక్తి బీహార్‌ను గెలవాలని బయలుదేరారు. అయితే ఒక్క సీటు కూడా గెలవలేకపోయాడు. కోటి మందికి పైగా సభ్యులున్న జన్ సురాజ్ పార్టీ, పది లక్షల ఓట్లను కూడా సంపాదించలేకపోయింది. పార్టీ నిలబెట్టిన 238 సీట్లలో 233 సీట్లలో డిపాజిట్లు గల్లంతయ్యాయి. అంటే వాటిలో 98% శాతం స్థానాల్లో కనీస ఓట్లు కూడా కరువయ్యాయి. జన్ సూరజ్ పార్టీకి దాదాపు 2% ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ అసదుద్దీన్ ఒవైసీ కి చెందిన ంఎఓఎఓ, మాయావతి ఖాఖ దీని కంటే మెరుగ్గా పనిచేశాయి. ఎన్నికలకు ముందు ప్రశాంత్ కిషోర్ గొప్ప వాదనలు చేశారు, కానీ ఎన్నికల ఫలితాలతో అవి బద్దలయ్యాయి.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.
medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..